www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 28 జనవరి 2023



రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ఎంవిఐ ప్రసాద్



మాట్లాడుతున్న ఎంవిఐ ప్రసాద్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎంవిఐ ఎవిఎస్.ప్రసాద్ సూచించారు. శుక్రవారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్‌టిసి డిపోలో డ్రైవర్లు, ఇతర సిబ్బందికి రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ పి.గంగాధరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణం.. రూ.41 కోట్లే ..!

ఈ ఏడాది ఏలూరు జిల్లాలో పంట రుణాల లక్ష్యం రూ.7,407 కోట్లు

75 శాతం సాగుచేస్తున్న కౌలురైతులకు రుణాల మంజూరులో దారుణం

57 వేల మందికి కౌలుకార్డుల లక్ష్యంలో 43 వేల మందికే అందజేత

మంజూరైన రుణంలో ఒక్కో రైతుకు రూ.పది వేలు కూడా రాని దుస్థితి



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్న కౌలురైతుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. ఏలూరు జిల్లాలో కౌలురైతులకు మంజూరైన రుణాల లెక్కలు చూస్తే కౌలురైతుల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి ఏపాటిదో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉందని తెలుస్తోంది. ఏలూరు జిల్లాలో 28 మండలాలు ఉన్నాయి. జిల్లా వ్యవసాయ సాగులో 75 శాతం వరకూ కౌలురైతులే చేస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలో పెద్దఎత్తున కౌలురైతులు ఉన్నప్పటికీ కౌలు(సిసిఆర్‌సి)కార్డుల జారీ కింద జిల్లా అధికారులు తీసుకున్న లక్ష్యం కేవలం 57,652 మందికి మాత్రమే. నిర్దేశించుకున్న లక్ష్యం మేరకైనా కౌలుకార్డులు మంజూరు చేశారా అంటే అదీ లేదు. ఏలూరు జిల్లావ్యాప్తంగా అధికారుల లెక్కల ప్రకారం 43,551 కార్డులు మంజూరయ్యాయి. అంటే నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం చూసినా ఇంకా దాదాపు 14 వేల మంది కౌలురైతులకు కార్డులు మంజూరు కాలేదు. కౌలుకార్డులు ఇచ్చిన రైతులకు మంజూరు చేసిన పంట రుణాల లెక్కలు చూస్తే ఔరా అనిపించక మానదు. అధికారుల లెక్కల ప్రకారం ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో 42,139 మంది కౌలురైతులకు రూ.41.64 కోట్ల రుణం మంజూరు చేశారు. అంటే ఒక్కో రైతుకు రూ.9,882 రుణం ఇచ్చినట్లు లెక్కలు చెబుతున్నాయి. కౌలురైతులు తక్కువగా లెక్కించినా రెండెకరాలు సాగు చేస్తారు. ఎక్కువ మంది మూడెకరాల నుంచి ఐదెకరాల వరకూ సాగుచేసే పరిస్థితి ఉంది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం చూసినా వరిసాగులో ఎకరాకు రూ.30 వేలకు పైగా పెట్టుబడి అవుతోంది. రెండెకరాలు సాగు చేసే కౌలురైతులకు రూ.పది వేలు కూడా రుణం అందించకపోతే సాగుకు ఏవిధంగా ప్రోత్సాహం ఇచ్చినట్లో ప్రభుత్వమే చెప్పాల్సి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని రైతాంగానికి రూ.7,407 కోట్లు పంట రుణాలు లక్ష్యంగా ఇవ్వాలని నిర్దేశించారు. నిబంధనల ప్రకారం పంట రుణాలు అనేవి సాగు చేసే కౌలురైతులకు ఇవ్వాలి. భూయజమానులకు పంటేతర రుణం ఇవ్వాలి. అటువంటి పరిస్థితి మాత్రం లేకుండాపోయింది. రూ.ఏడు వేల కోట్లకు పైగా పంటరుణాల లక్ష్యం కాగా అందులో జిల్లా వ్యవసాయ సాగులో 75 శాతం సాగుచేస్తున్న కౌలురైతులకు ఇచ్చింది కేవలం రూ.41.64 కోట్లు మాత్రమే. దీన్నిబట్టి నిర్దేశించుకున్న లక్ష్యంలో ఎంతశాతం రుణం అందించారో అర్థం చేసుకోవచ్చు.

పెట్టుబడుల కోసం నానావస్థలు

జిల్లా వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్న కౌలురైతులకు పంటరుణాలు అందడం లేదని అధికారుల లెక్కలే చెబుతున్నాయి. దీంతో సాగు పెట్టుబడులకు కౌతురైతులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. గతంలో రైతులు తాము పండించిన ధాన్యం మిల్లర్లు, కమీషన్ వ్యాపారులకు విక్రయించేవారు. దీంతో తమకు కావాల్సిన పెట్టుబడి అంతా మిల్లర్లు, కమీషన్ వ్యాపారుల నుంచే తీసుకునేవారు. ధాన్యం విక్రయించిన తర్వాత లెక్కలు చూసుకునే వారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో కొత్త నిబంధన తెచ్చింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం అమ్మాలని నిబంధన పెట్టింది. ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తుండటంతో మిల్లర్లు, కమీషన్ వ్యాపారులు రైతులకు పెట్టుబడులు పెట్టడం నిలిపివేశారు. దీంతో కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బ్యాంకుల నుంచి ప్రభుత్వం రుణాలు అందించకపోవడం, మరోపక్క కమీషన్ వ్యాపారులు, మిల్లర్లు పెట్టుబడులు నిలిపివేయడంతో కౌలురైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఎన్నడూ లేనంత దారుణంగా ఈ ఏడాది ఇప్పటి వరకూ కేవలం రూ.41.64 కోట్లు మాత్రమే బ్యాంకులు రుణాలు ఇవ్వడంపై కౌలురైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. భూయజమానులను ఒప్పించి కౌలురైతులకు రుణాలిప్పించడంలో జిల్లా వ్యవసాయశాఖ విఫలమైందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఇదే తీరు కొనసాగితే భవిష్యత్తులో కౌలురైతులు సాగు నుంచి తప్పుకునే పరిస్థితి ఏర్పడనుంది. అదే జరిగితే వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం రానుంది. వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్న కౌలురైతులను ఆదుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.


స్వామినాథన్ సిఫార్సుల అమలు కోరుతూ వినతి

ప్రజాశక్తి - గణపవరం

ఢిల్లీలో రైతుల ఉద్యమం సందర్భంగా కేంద్రం ఇచ్చిన హామీలు తక్షణం అమలు చేయాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా శుక్రవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్ కృష్ణస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం మండల కార్యదర్శి గుత్తుల శ్రీను, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు పి.నరసింహమూర్తి, కెవిపిఎస్ మండల కార్యదర్శి చిన్ని నాగేశ్వరరావు, సిఐటియు మండల నాయకులు ఎం.వెంటరావు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి పంటలకు మద్దతు ధరతోపాటు మద్దతు గ్యారంటీ చట్టం చేయాలని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరారు.



వినతిపత్రం అందిస్తున్న నేతలు



నినదిస్తున్న రైతులు, నేతలు

హమాలీ ఛార్జీలు రైతులకు వెంటనే చెల్లించాలి

బొమ్మిడి సొసైటీ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఉంగుటూరు

ధాన్యం హమాలీ ఛార్జీలు రైతులకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో మండలంలోని బొమ్మిడి సొసైటీ వద్ద రైతులు, కౌలు రైతులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా కన్వీనర్ కె.అప్పారావు మాట్లాడుతూ రైతులు ధాన్యం తోలి రెండు నెలలు గడుస్తున్నా హమాలీ ఛార్జీలు చెల్లించకపోవడం అన్యా యమన్నారు. బొమ్మిడి సొసైటీ పరిధిలో దాదాపు రూ.10 లక్షల వరకు రైతులకు, కౌలు రైతులకు హమాలీ ఛార్జీలు చెల్లించాల్సి ఉందన్నారు. ధాన్యం సొమ్ము చెల్లించినప్పుడే హమాలీ ఛార్జీలూ చెల్లిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ ప్రకటన ఆచరణలో అమలు కావడం లేదని విమర్శించారు. హమాలీ ఛార్జీలు వెంటనే చెల్లించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం రైతులు సొసైటీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దుడే కేశవ, లంకా వెంకటేశ్వరరావు, యర్రా వెంకటేశ్వరరావు, బుర్ల చింతాల, వానపల్లి హరికృష్ణ, దుడే రాంబాబు, ఆకుల వెంకన్న, నేరెళ్ల నాగేశ్వరరావు, మద్దాల సత్తిబాబు, మద్దుకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ

పేదలకు భూమి పంచాలి.. కూలి పెంచాలి

వ్య.కా.స

ప్రజాశక్తి - టి.నర్సాపురం

అర్హులైన పేదలందరికీ భూమి పంచాలని, కూలీలకు కూలి పెంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని మల్లప్పగూడెంలో సంఘం మండల కమిటీ, ముఖ్యకార్యకర్తల సమావేశం మండల కార్యదర్శి మడకం సుధారాణి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి రామకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక, గిరిజన, రైతుసంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 8న ఉదయం 10 గంటలకు మండలంలోని రామన్నపాలెం గ్రామంలో ఎర్ర కాలువ మిగులు భూముల్లోని పామాయిల్ తోటలో జిల్లా సదస్సు జరుగుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఆదివాసులు, దళితులు, భూమిలో సాగులో ఉన్న పేదలు భూమి కోసం పోరాటాలు చేస్తున్న వారు జిల్లా సదస్సులో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జంగారెడ్డిగూడెం, టి.నర్సాపురం మండలాల్లోని సుమారు 1500 ఎకరాలు ఎర్ర కాలువ రిజర్వాయర్ మిగులు భూములను పేదల సాగుకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివాసుల హక్కులు కాపాడి పోడు భూములకు పట్టాలివ్వాలని, దోసపాడు ఇతర చోట్ల అసైన్‌మెంట్ భూములను దళితులకు పొజిషన్ కల్పించి పట్టాలివ్వాలని, విఎస్ఎస్ పంటలకు కటింగ్ ఆర్డర్లు ఇవ్వాలని కోరారు. వ్యవసాయ కూలీలకు కూలి పెంచాలన్నారు. ఉపాధి కూలీలకు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ, అనుమోలు మురళి, పుసం చిన్న సూర్యారావు, సరియం దుర్గమ్మ పాల్గొన్నారు.

ఆధునికీకరణ పనులకు ప్రతిపాదనలు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గోదావరి డెల్టా ధవళేశ్వరం చీఫ్ ఇంజినీర్ ఆదేశాల ప్రకారం ఫేజ్-2లో భాగంగా అవసరం మేరకు చేపట్టాల్సిన అతిముఖ్యమైన ఆధునికీకరణ పనులకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు ఏలూరు ఇరిగేషన్ ఎస్ఈ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 25న 'ఆధునికీకరణ జరిగేనా' అంటూ 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డెల్టా ఆధునికీకరణకుగాను మొత్తం రూ.1464.44 కోట్లు మంజూరవ్వగా సుమారు రూ.800 కోట్లు విలువ చేసే పనులు జరిగాయని తెలిపారు. ప్రభుత్వం 2019 మే 29న ఇచ్చిన ఆదేశాల మేరకు పరిపాలనా అనుమతులు లభించి ఇంకనూ ప్రారంభంకాని పనులన్నీ రద్దయినట్లు వివరించారు. 2020 జులై ఎనిమిదో తేదీన జిఒ.365ను అనుసరించి ప్రభుత్వం, గుత్తేదారుల ఉమ్మడి పరస్పర అంగీకారంతో మరికొన్ని డెల్టా ఆధునికీకరణ పనులు ముగిసినట్లు తెలిపారు. డెల్టా ఆధునికీకరణకు సంబంధించి పాక్షిక దశలో ఉన్న కొన్ని పనులను పున:ప్రారంభించడానికి ప్రభుత్వ అనుమతి కోరామని చెప్పారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న పుల్లారావు

త్వరితగతిన వంతెన నిర్మాణ పనులు చేపట్టాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని రౌతుగూడెం వద్ద నిర్మిస్తున్న చింతలపూడి ఎత్తిపోతల పథకం వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ ఎన్.పుల్లారావు అధికారులకు సూచించారు. శుక్రవారం వంతెన పనులు జరిగిన తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకానికి సంబంధించి వంతెన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వంతెనకు సంబంధించి నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాద్, జంగారెడ్డిగూడెం డివిజన్ ఇఇ వై.కృష్ణయ్య, డిఇ శ్రీనివాస్, గాయత్రి ఏజెన్సీ ప్రాజెక్ట్ మేనేజర్ కె.అజ్మీర రవి, ఎజిఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

మేలైన పద్ధతులు రైతులకు ఉపయోగకరం

వ్యవసాయ శాఖ ఎడి డాక్టర్ పి.ఉషారాజకుమారి

ప్రజాశక్తి - భీమడోలు


వరి సాగులో మేలైన వ్యవసాయ పద్ధతులు అవలంబించడం రైతులకు ఉపయోగకరమని వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు డాక్టర్ పి.ఉషారాజకుమారి తెలిపారు. జిల్లా స్థాయిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమాన్ని అమలు చేసే క్రమంలో భీమడోలును పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సుమారు 250 ఎకరాల విస్తీర్ణంలో సదరు సాగు చేపట్టారు. దీనిలో ప్రతి శుక్రవారం పొలంబడి కార్యక్రమం చేపడుతున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిసరాల విశ్లేషణ, శత్రు, మిత్ర పురుగులు గుర్తించడంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో వరి పైరుకు నష్టం కల్గించే శాతానికి మించి ఆకు ముడత తెగులు ఆశించటం, కాండం తొలుచు పురుగు ఉన్నట్లు గమనించారు. దీని నివారణకు కార్బోహైడ్రోక్లోరైడ్ గుళికలను ఎకరం ఒక్కంటికి ఎనిమిది కేజీల వంతున చల్లాలని సూచించారు. లేదా క్లోరాస్ట్రబిల్ నాలుగు మిల్లీలీటర్ల ద్రావణాన్ని పది లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయటం ద్వారా వాటి అదుపు చేయొచ్చని సూచించారు. ఇక సేంద్రియ వ్యవసాయ పద్ధతుల అమల్లో భాగంగా కోడిగుడ్లు, నిమ్మరసం కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయడం ద్వారా వరి పైరుకు పిలకలు ఎక్కువగా వస్తాయని, దీనివల్ల దిగుబడి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఉషారాణి, రాజమండ్రి వ్యవసాయ కళాశాల విద్యార్థులు, గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

సినీనటి జమున మృతితో విషాదఛాయలు

ఉమ్మడి పశ్చిమగోదావరితో విడదీయరాని అనుబంధం


ప్రజాశక్తి - పాలకొల్లు

సినీనటి జమున మృతితో జిల్లాలో విషాదఛాయలు అలుముకున్నాయి. పౌర సన్మానాలతోపాటు కొన్ని షూటింగ్‌ల్లోనూ ఆమె ఈ ప్రాంతంలో పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ తరపున నాటి అత్తిలి నియోజకవర్గంలో ప్రచార సభల్లో పాల్గొన్నారు.



భీమవరంలో మావుళ్లమ్మ సన్నిధిలో జమునకు సత్కారం (ఫైల్‌ఫొటో)

నర్సాపురం పరిసర ప్రాంతాల్లో 1963-64 మధ్యకాలంలో చిత్రీకరించిన మూగమనసులు సినిమా నేటికీ పాలకొల్లు పరిసర ప్రాంత వాసులకు చిరకాల జ్ఞాపకమే. సినీనటులు అంటే మోజుగా ఉండే ఆ రోజుల్లో పాలకొల్లు నుండి మూగమనసులు సినిమా షూటింగ్ చూసేందుకు పెద్దసంఖ్యలో జనం నరసాపురం వెళ్లేవారు. ఆ సినిమాలో అక్కినేని నాగేశ్వరరావుతోపాటు సావిత్రి, జమునలను చూడటానికి పాలకొల్లు నియోజకవర్గం నుంచి ఎక్కువగా వెళ్లేవారు. ఆ చిత్రంలోని నటీనటులకు 1964లో పాలకొల్లు మున్సిపాల్టీ పౌర సన్మానం చేసింది. నాటి దర్శక నిర్మాతలతోపాటు అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి, జమునలకు ఘనంగా పౌర సన్మానం జరిగింది. నాగేశ్వరరావు, సావిత్రి ఇప్పటికే మృతి చెందగా తాజాగా జమున మరణం నాడు పౌరసన్మానంలో పాల్గొన్న విన్నకోట వెంకటేశ్వరరావు, వీరసత్యం, వంగా నరసింహారావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పాలకొల్లుకు చెందిన దర్శకరత్న దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన తాతమ్మ కలలో కూడా జమున కీలకపాత్ర పోషించింది. పాలకొల్లు నటులతో జమునకు సత్సంబంధాలు ఉన్నాయి. ఆమె మృతి పట్ల పాలకొల్లు నాటక కళాపరిషత్ కళాకారులు సంతాపం వ్యక్తం చేశారు.



గోదావరి తీరంలో షూటింగ్‌లో జమున (ఫైల్‌ఫొటో)

భీమవరం రూరల్: అలనాటి సినీనటి జమునకు భీమవరం పట్టణానికి ప్రత్యేక అనుబంధం ఉంది. పట్టణంలో మావుళ్లమ్మ అమ్మవారి 52వ వార్షికోత్సవానికి నీరుల్లి, పండ్ల వర్తక సంఘం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జమునను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. శుక్రవారం ఆమె మతి చెందారని తెలియడంతో ఇటు మావుళ్లమ్మ ఉత్సవ కమిటీ, కళాకారులు, పట్టణ వాసులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు .

జమున మృతికి సిపిఎం సంతాపం

మహానటి జమున మృతిపట్ల సిపిఎం సంతాపం తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటన విడుదల చేశారు. జమున తెలుగు సినీరంగంలో అగ్ర కథానాయకురాలిలో ఒకరిగా వెలుగొందారని, చిత్ర రంగంలో వివిధ రూపాల్లో తెలుగు సినిమా పరిశ్రమలో సేవలందించారని కొనియాడారు. ప్రజలను చైతన్యం చేసే అనేక ప్రజానాట్యమండలి నాటికల్లో ఆమె నటించి ప్రజలను మెప్పించారని కొనియాడారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

అటవీ ప్రాంతంలో మహిళ హత్య

వివాహేతర సంబంధమే కారణం

వారం తర్వాత ఆలస్యంగా వెలుగులోకి

పోలీసుల అదుపులో నిందితుడు

ప్రజాశక్తి - టి.నరసాపురం, చింతలపూడి

వివాహేతర సంబంధం మహిళ ప్రాణాలను బలిగొంది. ఈ సంఘటన చింతలపూడి, టి.నరసాపురం మండలాల సరిహద్దు అటవీ ప్రాంతంలో వారం రోజులు ఆలస్యంగా శుక్రవారం వెలుగుచూసింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

టి.నరసాపురం మండలం బంధంచర్ల గ్రామానికి చెందిన మృతురాలు కంచెర్ల సునీత (39)కు 20 సంవత్సరాల క్రితం చాట్రాయి మండలం కోటపాడు గ్రామానికి చెందిన కంచెర్ల మాణిక్యాలరావుతో వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఏడాది క్రితం భర్త మాణిక్యాలరావు చనిపోవడంతో ఇద్దరు పిల్లలతో సునీత జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో సునీత తన పెళ్లికి ముందు తన స్వగ్రామం బంధంచర్లలో పరిచయం ఉన్న శీకాకోలు సువర్ణరాజుతో సన్నిహితంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో సువర్ణరాజు రూ.20 వేలు వరకూ ఆమెకు ఇచ్చాడు. కొన్ని రోజులుగా సునీత తనతో సరిగా మాట్లాడటం లేదని, ఎప్పుడు ఫోన్ చేసినా బిజీ అని వస్తోందని సువర్ణరాజు అసహనానికి గురై అనుమానం పెంచుకున్నాడు. దీంతో ఈ నెల 20న కలుద్దామని చెప్పడంతో సునీత ఒంటరిగా బంధంచర్ల వచ్చింది. ఇద్దరు కలిసి టి.నరసాపురం మండలం బంధంచర్ల, చింతలపూడి మండలం కంచనగూడెం అటవీప్రాంతంలో ఏకాంతంగా కలుసుకున్నారు. అక్కడ ఫోన్ బిజీ అని ఎందుకు వస్తుందని సువర్ణరాజు ప్రశ్నించగా నా ఇష్టమని, అడగడానికి నువ్వెవరూ అని సునీత ఎదురు ప్రశ్నించింది. దీంతో సువర్ణరాజు కోపంతో ఆమె ముక్కు, గొంతు నొక్కి హత్య చేశాడు. మృతదేహాన్ని అక్కడే వదిలేసి పరారయ్యాడు. ఇదిలా ఉండగా సునీత కన్పించడం లేదని బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసు విచారణలో భాగంగా అనుమానాస్పదంగా తిరుగుతున్న సువర్ణరాజును అదుపులోకి తీసుకుని విచారించగా హత్యోదంతం వెలుగు చూసిందని చింతలపూడి సిఐ మల్లేశ్వరరావు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, నిందితుని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించామని సిఐ తెలిపారు.



సునీత (ఫైల్‌ఫొటో)



వినతిపత్రం అందిస్తున్న నేతలు


బకాయి వేతనాల కోసం 3 నుంచి నిరవధిక సమ్మె

అడిషనల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేత

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు)

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు నగరపాలక సంస్థ కాంట్రాక్ట్ కార్మికులకు, స్కూల్ స్వీపర్లకు రావాల్సిన రూ.ఐదు కోట్లకుపైగా బకాయి జీతాలు, హెల్త్ అలవెన్స్‌లు, పిఆర్‌సి ఎరియర్స్ కోసం ఫిబ్రవరి 3వ తేదీ నుండి నిరవధిక సమ్మె చేపట్టాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నగర కమిటీ సమావేశం నిర్ణయించింది. స్థానిక సిఐటియు కార్యాలయంలో యూనియన్ అధ్యక్షులు లావేటి కృష్ణారావు అధ్యక్షతన నగర కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు బి.సోమయ్య, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ ఏ మున్సిపాల్టీలో కూడా కాంట్రాక్ట్ కార్మికులకు ఎలాంటి బకాయిలూ లేవన్నారు. అయితే ఏలూరు నగరపాలక సంస్థలో సంవత్సరం కాలంగా కాంట్రాక్ట్ కార్మికులకు రావాల్సిన బకాయి జీతాలు, బకాయి హెల్త్ అలవెన్స్‌లు, పిఆర్‌సి ఎరియర్స్ చెల్లించకుండా ఇబ్బందుల పాల్జేస్తున్నారని అన్నారు. మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు నామమాత్రపు వేతనాలపై పని చేస్తున్నారని, ఇలాంటివారు కోట్లాది రూపాయల బకాయిల వల్ల వినాయక చవితి, దసరా, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి వంటి పండుగలన్నీ పస్తులతోనే గడిపారన్నారు. అధికారులు, పాలకుల చుట్టూ తిరిగి తిరిగి వేసారిపోయారని, తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెలోకి వెళ్లాల్సి వస్తుందని అన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ పాలకవర్గం, అధికారులు, జిల్లా అధికారులు స్పందించి ఫిబ్రవరి రెండో తేదీలోపు రూ.ఐదు కోట్లకుపైగా రావాల్సిన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికుల నిరవధిక సమ్మెకు అధికారులదే పూర్తి బాధ్యతని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కార్యదర్శి కారు దుర్గారావు, వివిధ సర్కిళ్ల నాయకులు, బంగారు వెంకటేశ్వరరావు, పంతం చిన్న నాగరాజు, తానంకి జార్జి, అల్లం హనుమంతరావు, బంగారు దుర్గారావు, జి.నారాయణరాజు, బి.రమేష్, ఎం.గోపి, ఎ.రామకృష్ణ, మందపాటి దుర్గారావు పాల్గొన్నారు. ఫిబ్రవరి మూడో తేదీ నుండి చేపట్టబోయే సమ్మె గురించి మున్సిపల్ అధికారులు, పాలకవర్గానికి సమ్మె నోటీసులు ఇవ్వాలని సమావేశం నిర్ణయించింది. మున్సిపల్ కార్మికులు మూడో తేదీ నుండి చేపట్టబోయే సమ్మెకు నగరంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాలు, ప్రజానీకం అంతా మద్దతివ్వాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. అనంతరం అడిషనల్ కమిషనర్ బాపిరాజుకు నేతలు సమ్మె నోటీసు అందజేశారు.


సర్పంచిని, కార్యదర్శిని సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు

సర్పంచి, కార్యదర్శికి సత్కారం

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు గ్రామపంచాయతీ పర్యావరణ పరిరక్షణ హితంగా పారిశుధ్య పనులు చేపట్టడం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని అదనపు ఆదాయ వనరుగా మార్చిన సర్పంచి పి.సునీతమాన్‌సింగ్, గ్రామ కార్యదర్శి ఎన్.ఠాగూర్ సేవలు అభినందనీయమని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు అన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సమర్ధవంతంగా నిర్వహించటం, ఇదే క్రమంలో గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం వంటి కార్యక్రమాలను సమర్ధవంతంగా చేపట్టినందుకు భీమడోలు ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైంది. ఈ మేరకు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ పంచాయతీ తరపున గ్రామపంచాయతీ కార్యదర్శి ఎన్.ఠాగూర్ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ నుంచి ప్రశంసాపత్రాన్ని స్వీకరించారు. ఈ మేరకు సర్పంచి పర్యవేక్షణలో గ్రామపంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి ప్రత్యేకించిన శానిటరీ మేస్త్రి, సచివాలయాల సిబ్బంది, ఇతరులు అందించిన సహాయ సహకారాలకు సచివాలయాల సిబ్బంది, ప్రజా ప్రతినిధులు వారిని శుక్రవారం భీమడోలు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ చైతన్య యువజన సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.మాన్‌సింగ్ పాల్గొన్నారు.

విద్యార్థినికి సైకిల్ అందజేత

జంగారెడ్డిగూడెం: ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు దాతల సహకారంతో సైకిల్ అందించామని వారధి ట్రస్ట్ వ్యవస్థాపకులు వలవల తాతాజీ తెలిపారు. వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో దాత మండవల్లి రాంబాబు వితరణతో బాలికకు సైకిల్ పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వలవల తాతాజీ మాట్లాడుతూ స్థానిక నాలుగో వార్డు ఇందిరానగర్ కాలనీ నుంచి బాలికల ప్రభుత్వ పాఠశాలలకు వెళ్తున్న 18 మందికి దాతల సహకారంతో సైకిళ్లు అందించాలనే సంకల్పంలో భాగంగ శుక్రవారం ఆరో సైకిల్ అందించినట్లు తెలిపారు. బాలికలు ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న షేక్ రజియాకు పట్టణానికి చెందిన మండవల్లి రాంబాబు వ్యక్తిగత వితరణతో సైకిల్ పంపిణీ చేశారని తెలిపారు. దాత మండవల్లి రాంబాబు కుమార్తె దర్శిని పుట్టినరోజు సందర్భంగా వారి చేతుల మీదుగా సైకిల్ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనాగేశ్వరకుమార్, బసవరాజు వేణు, మద్దిపాటి శ్రీను, తియ్యాల ప్రసాద్, కంచాల పండు, షేక్ సిరాజ్, ప్రసాద్, కుమార్ పాల్గొన్నారు.

దాళ్వాకు నీరందించడంపై రైతుల హర్షం

ప్రజాశక్తి - ముసునూరు


పంటపొలాల్లో నీరు

మండలంలోని పలు గ్రామాల్లోని దాళ్వా పంటలకు నీరు అందించిన ఫలంగా ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు కృతజ్ఞతలని జెడ్పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్ అన్నారు. నీరు లేక దాళ్వా పంట ఎండి పోతుందని మండలంలోని లోపూడి, యర్రవారిగూడెం, వలసపల్లి, గుడిపాడు, గుళ్లపూడి, ఎల్లాపురం, బలివే గ్రామాల్లోని ఆయుకట్టు రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్‌అప్పారావును జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, లోపూడి సర్పంచి పేరం కృష్ణ, రైతులు కలిసి సమస్యను వివరించారు. స్పందించిన ఎంఎల్ఎ పోలవరం రిజర్వాయర్ ఇఇతో ఫోన్‌లో మాట్లాడి పొలాలకు నీరు అందించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఆయా గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సొసైటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - కైకలూరు

రైతు సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ఆలపాడులో రూ.21.50 లక్షలతో నిర్మించనున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన భవన నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడివి వెంకటకృష్ణమోహన్, ధనలక్ష్మి, గ్రామ ఉపసర్పంచి సలాది జ్యోతి, తాడినాడ పిఎసిఎస్ అధ్యక్షులు సాగి చిన్నబ్బాయిరాజు, పెంచికలమర్రు సర్పంచి జయమంగళ కాసులు పాల్గొన్నారు.


ఎన్నికైన ఆగిరిపల్లి జామీయా మసీద్ నూతన కమిటీ

జామియా మసీద్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆగిరిపల్లి జామీయా మసీద్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా షేక్ ఛాన్‌బాషా, సయ్యద్ హుస్సేన్ ఎన్నికయ్యారు. జామీయా మసీద్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు.ఉపాధ్యక్షులుగా షేక్ గౌస్, సహాయ కార్యదర్శిగా షేక్ నజీర్‌తో పాటు 14 మందితో నూతనకార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జామీయా మసీద్‌లో మతగురువు అబ్దుల్ కలామ్, సంఘ పెద్ద షేక్ సుభాని ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు జామీయా మసీద్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా పాటు పడతామని చెప్పారు. ఈ నూతన కార్యవర్గం ఎంపిక పట్ల ముస్లిం సంఘం హర్షం వ్యక్తం చేసింది.

ప్రజా సంక్షేమానికి సిఎం జగన్ పెద్దపీట

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రజా సంక్షేమానికి సిఎం జగన్ పెద్దపీట వేస్తున్నారని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని వడాలిలో శుక్రవారం గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని అత్యవసర పనులను గుర్తించి, నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టి పూర్తి చేయడానికి మార్గం సుగమం అయిందన్నారు. వడాలిలో నిర్వహించిన గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం 150 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, పార్టీ మండల కన్వీనర్ మోట్రు ఏసుబాబు, వైస్ ఎంపిపిలు సునీత, రాధా, గ్రామ సర్పంచి మరీదు దుర్గశ్రీ, ఎంపిటిసి సభ్యులు పల్లి నాగరాజు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.77 వేలు విరాళం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలోని నూకాలమ్మ ఆలయానికి దాతలు రూ.77,232 విరాళం అందించారని ఆలయ కమిటీ ఛైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారయణ తెలిపారు. శుక్రవారం ఆలయానికి హైదరబాద్ నుంచి వచ్చిన దాతలు ఆలయ అభివృద్ధికి చీకటి దివ్యతేజ, దుర్గా శారద, నిత్విక్ శ్రీ సాయి కుటుంబ సభ్యులు రూ.62,116, విజయవాడ నుంచి వచ్చిన డాక్టర్ లింగాల సాయి కృష్ణ, డాక్టర్ వెంకట హిమ బిందు, కన్షిక కృతిసాయి కుటుంబ సభ్యులు రూ.25,116 విరాళంగా అందించారని తెలిపారు. దాతలకు నూతన వస్త్రాలు అందించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు రాజాన సత్యనారయణ తెలిపారు.

విద్య విషయంలో నిర్లక్ష్యం తగదు

రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్

ప్రజాశక్తి - ముసునూరు

విద్య విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ అన్నారు. మండలంలోని ముసునూరు బాలుర హాస్టల్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు ప్రశ్నలను అడిగారు. చదువు విషయంలో విద్యార్థులు బాగా వెనుకబడి ఉన్నారని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్య విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా విద్యాశాకాధికారి డి.మధుసూదనరావు, సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్యామ సుందరరావు, డిప్యూటీ విద్యాశాఖాధికారి సేమ్యానాయుక్‌లకు సూచించారు. విద్యాభివృద్ధికి అందరూ సమన్వయంతో కృషి చేయాలని చెప్పారు. లేకపోతే షోకాజ్ నోటీసులు ఇస్తామని హెచ్చరించారు.


అధికారులతో మాట్లాడుతున్న ప్రవీణ్‌ప్రకాష్

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు

మండలంలోని పోణంగి గ్రామంలో శుక్రవారం చట్టాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి ఈ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 11వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అన్ని రకాల క్రిమినల్ కేసులు, కుటుంబ వివాద, చెక్ బౌన్స్, చిట్ ఫండ్ కేసులు, బ్యాంకు లావాదేవీలు, మున్సిపల్ ట్యాక్స్ వివాదాల కేసులను రాజీ చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాధితులకు నష్టపరిహారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా చెల్లిస్తారని తెలిపారు.

వరిగడ్డికి పెరిగిన గిరాకీ

ఎకరం ధర రూ.10 వేలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎండు వరిగడ్డికి బాగా డిమాండ్ పెరిగింది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి కాక పక్కనే ఉన్న కృష్ణాజిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి నిత్యం లారీలు, ట్రాక్టర్లు, ఎడ్లబండ్లపై గడ్డి ముదినేపల్లి సెంటర్ నుంచి ఇతర ప్రాంతాలకు తరలిపోతోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ముదినేపల్లిలోని వైకుంఠపురం సెంటర్ నుంచి వివిధ మండలాలకు వరిగడ్డి లారీలు, ట్రాక్టర్లు వెళ్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పశుగ్రాసానికి బాగా గిరాకీ ఉండటంతో ఎండుగడ్డికి ఆమాంతంగా ధర పెరిగింది. ఎకరం ఎండు గడ్డి ధర రూ.పది వేలు పైచిలుకు పలుకుతోంది. దీంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో ఎండుగడ్డి లోడుతో వాహనాల్లో బయటకు గడ్డి తరలిపోతోంది.

ముదినేపల్లి మండలం నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర జిల్లాలకు ఎండుగడ్డి తరలిస్తూ వ్యాపారులు గడ్డి విక్రయాలు చేస్తున్నారు. ముఖ్యంగా కొల్లేరు ప్రాంతగ్రామాలైన కైకలూరు, మండవల్లి, ఆకివీడు, ఏలూరు మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో చేపల చెరువుల సాగు కారణంగా ఆ ప్రాంతాల్లో రైతులకు పశుగ్రాసం కొరత ఎక్కువగా ఉంది. దీంతో పశుపోషకులు పశువుల పెంపకానికి గడ్డి కోసం ఇక్కట్లు పడుతున్నారు. దీంతో ట్రాక్టర్ యాజమానులు ఎంత ధర చెబితే అంతధర చెల్లించాల్సి వస్తోంది. దీంతో పశుపోషకులకు వరిగడ్డిని అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది.

చేలో ఎకరం గడ్డి ధర రూ.పదివేలు

ట్రాక్టర్ యజమానులు రైతుల వద్ద నుంచి కళ్లాల్లో ఉన్న వరిగడ్డిని ఎకరం రూ.ఎనిమిది వేల నుంచి రూ.పది వేలకు కొనుగోలు చేస్తున్నారు. విడి గడ్డి ఎకరం రూ.ఎనిమిది వేలు, కట్టలు కటిన గడ్డి ఎకరం రూ.పదివేల చొప్పున అధిక ధరలకు గడ్డి వ్యాపారులు విక్రయిస్తున్నారు. గడ్డి కొరతను అసరా చేసుకొని ఆయా ప్రాంతాల్లో గడ్డి అవసరతను బట్టి వ్యాపారులు అధిక ధరకు విక్రయాలు చేస్తున్నారు. ముదినేపల్లి మండలంలోని కోడూరు, పెదపాలపర్రు శివారు మండలాల్లోని గుడ్లవల్లేరు, పెదన, గూడూరు తదితర మండలాల నుంచి నిత్యం ట్రాక్టర్లు, లారీలు వరిగడ్డిని ఇతర జిల్లాలకు, మండలాలకు తరలిస్తున్నాయి. దూరాన్ని బట్టి గడ్డి ఎగుమతి, దిగుమతి కిరాయి, కార్మికుల కూలీ ఖర్చులు, ట్రాక్టర్ కిరాయి కలిసి మొత్తం ఎకరం గడ్డి రైతుకు చేరే దూరాన్ని బట్టి రూ.15 వేలు నుంచి 20వేలు వరకు ధర పలుకుతుంది. దీంతో పశుపోషకులకు పశువుల పెంపకం భారంగా మారింది. కొందరు రైతులు తమ పశువులను అమ్ముకుని పాల ప్యాకెట్ల వైపు మొగ్గు చూపుతున్నారు.


ముదినేపల్లి నుంచి వరిగడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్

రాజ్యాంగ రక్షణకు ఉద్యమించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం సిపిఎం మండల కమిటీ సమావేశం ఎ.దుర్గారావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు మొడియం నాగమణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగ రక్షణ దేశ స్వలంభన కోసం ఉద్యమించాల్సిన బాధ్యత దేశంలో ప్రతిఒక్కరి పైన ఉందన్నారు. అధికారంలో ఉన్న రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ రాజ్యాంగం మౌలిక సూత్రాలపై బిజెపి దాడి చేస్తుందన్నారు. సనాతన విధానం పేరుతో మనుధర్మ శాస్త్రాన్ని, పద్ధతులను ప్రజలపై రుద్దాలని చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం మండల కార్యదర్శి శుక్ల బోయిన రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో ఉన్న సౌకర్యాల కంటే ప్రయివేట్ రంగంలోనే అనేక సౌకర్యాలు ఉన్నాయని పాలకులు అబద్ధపు ప్రచారాన్ని చేస్తున్నారన్నారు. ప్రభుత్వం తీసు కొచ్చిన జిఒ 1 అత్యంత దారుణమైందన్నారు. విభజన హామీ లు అమలు చేయకుండా రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నమ్మక ద్రోహం చేస్తుందన్నారు. ఎస్.శివకుమార్ మాట్లా డుతూ ఉపాధి లేక నిరుద్యోగ యువత ఆత్మహత్యలు చేసుకుం టున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కుగా ఉద్యమం 715 రోజుల నుంచి చేస్తున్నట్లు చెప్పారు. ఆకులు దుర్గారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ప్రధాని మోడీ ఇద్దరూ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రాజ్యాంగ పరిరక్షణ స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తితో పని చేయాలన్నారు. డి.ధనరాజ్ మాట్లాడుతూ కార్మిక హక్కులను, కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సవరణ పేరుతో తీసేసి కార్మికులకు ద్రోహం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో సిహెచ్.సత్యనారాయణ, కడియం సీతారాముడు పాల్గొన్నారు.

2న వైద్య శిబిరం

ప్రజాశక్తి - కైకలూరు

నియోజకవర్గంలోని ప్రత్యేక అవసరాల పిల్లలు ఫిబ్రవరి రెండో తేదీన జరిగే వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి అడవి కృష్ణమోహన్ తెలిపారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్య నిర్ధారణ శిబిరం పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నుంచి 18 సంవత్సరాల ప్రత్యేక అవసరాలు కలిగిన బాల బాలికలు ఈ శిబిరంలో పాల్గొని ధ్రువీకరణ పత్రాలను పొందాలన్నారు. గ్రామాల్లోని వాలంటీర్లు ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి ఈ శిబిరానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ శిబిరంలో పాల్గొనే చిన్నారుల తల్లిదండ్రులకు బసుఛార్జీలు, భోజన వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డ్, రెండు ఫొటోలు వెంట తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ రామారావు, ఇఒపిఆర్‌డి రవిశంకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు గుండుగొలను సొసైటీ మహాజన సభ

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను విశాల సహకార పరపతి సంఘం మహాజనసభ ఈ నెల 28వ తేదీ శనివారం ఉదయం స్థానిక సంఘ సహకార రైతు వేదిక వద్ద నిర్వహించనున్నట్లు ఛైర్‌పర్సన్ వగ్వాల విజయవెంకటభాస్కర్ తెలిపారు. దీనిలో భాగంగా 2003- 24 అంచనా బడ్జెట్, నేటి వరకు తాజా సంఘ జమా ఖర్చులు, 51 విచారణ రిపోర్టు చదివి, దానిపై చర్చించడం వంటి అంశాలను సభ ఆమోదానికి సమర్పిస్తారన్నారు. దీనికి అదనంగా ఛైర్ పర్సన్ అనుమతితో ఇతర అంశాలపై చర్చ ఉంటుందని తెలిపారు.

31న గణపవరం సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 31వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి తెలిపారు. సమావేశానికి మండల పరిషత్ అధ్యక్షులు దండు వెంకట రామరాజు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. సమావేశానికి ఎంపిటిసి సభ్యులు, అధికారులు, సర్పంచులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

దోమల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

దోమల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాటి ద్వారా ప్రాణాంతక వ్యాధులు డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.నాగేశ్వరరావు సూచించారు. స్థానిక 45వ డివిజన్ లక్ష్మీవరపుపేటలో జరుగుతున్న డ్రైడే కార్యక్రమాన్ని స్థానిక 45వ డివిజన్ కార్పొరేటర్ ఎండి ఇలియాస్ పాషాతో కలిసి ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ డెంగీ, మలేరియా కారక దోమలు మంచినీటిలో పెరుగుతాయని చెప్పారు. ప్రతి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెంగీ, మలేరియా సంబంధిత పరీక్షలు ఉచితంగా చేస్తామని, మందులు ఉచితంగా ఇస్తామని తెలిపారు. స్థానిక కార్పొరేటర్ ఇలియాస్ పాషా మాట్లాడుతూ మురికి కాలువలో చెత్త వేయరాదని, డ్రెయినేజీ సక్రమంగా లేకపోతే ఎఎన్‌ఎంలు, వాలంటీర్లు తన దృష్టికి తీసుకొస్తే శుభ్రం చేయిస్తామని తెలిపారు. 45వ డివిజన్ వార్డ్ కన్వీనర్ కంచుమర్తి తులసి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి గోవిందరావు, నాయకులు ఎండి సరూర్, ఎఎన్‌ఎంలు రోజా, జ్యోతి, కవిత ఆశావర్కర్లు విజయ, ప్రియాంక, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రపంచానికి వెలుగునిచ్చిన మహనీయుడు ఎడిషన్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

విద్యుత్ బల్బు కనుగొని ప్రపంచానికి వెలుగునిచ్చిన మహనీయుడు థామస్ అల్వా ఎడిషన్ అని ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఆవుల పుల్లారావు అన్నారు. థామస్ అల్వా ఎడిషన్ విద్యుత్ బల్బ్ కనుగొన్న తేదీ జనవరి 27ను పరస్కరించుకుని స్థానిక ధర్మన్న స్మారక భవనం వద్ద ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్, ప్లంబర్స్ మెకానిక్ యూనియన్ జెండాను యూనియన్ అధ్యక్షులు ఆవుల పుల్లారావు ఎగురవేశారు. అనంతరం నిర్వహించని సభలో ఆవుల పుల్లారావు మాట్లాడుతూ 1880లో అమెరికాకు చెందిన థామస్ అల్వా ఎడిషన్ బల్బును కనుగొన్నారన్నారు. అప్పటినుంచి ప్రపంచవ్యాప్తంగా అన్ని ఎలక్ట్రిక్ పరికరాలు అభివృద్ధి చెంది ప్రపంచానికి, దేశానికి వెలుగునిస్తున్నాయన్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కెవి.రమణ మాట్లాడుతూ ప్రపంచానికి వెలుగునిచ్చే ఎలక్ట్రికల్ వర్క్‌కి సరైన భద్రత కలిగిన జీవితం లేదన్నారు. ఎలక్ట్రిక్ వర్కర్ల రక్షణ కోసం ప్రభుత్వాలు ఇన్సూరెన్స్ కట్టాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో చనిపోయిన కార్మిక కుటుంబాన్ని పూర్తిగా ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సీనియర్ ఎలక్ట్రికల్ వర్కర్స్ నాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోట శివ కృష్ణ, కర్రి సూర్య, బాలిన ధర్మరాజు, వనపర్ల నవీన్ కుమార్, మానేపల్లి రామారావు, తియ్యాల గణేష్, గెడ్డం రమేష్, తిప్పాని బాలు, ఎంఎల్ఎస్.రాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్‌కు గాయాలు

శస్త్రచికిత్సకు రూ.15 లక్షలు ఆదుకోవాలని కుటుంబ సభ్యుల వేడుకోలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న యువకుడే ఆ కుటుంబానికి ఆధారం. యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాపాయ స్థితికి చేరడంతో కుటుంబం అయోమయ స్థితిలోకి వెళ్లిపోయింది. ఆదుకునేవారి కోసం ఎదురు చూస్తూ మదన పడిపోతున్నారు. పట్టణానికి చెందిన మహాశివబట్టు అనిల్ కుమార్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం రాత్రి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా జంగారెడ్డిగూడెం పట్టణంలోని త్రివేణి సెంటర్ వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అనిల్‌కుమార్ రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయమైంది. చెవి, ముక్కు నుంచి రక్తం రావడంతో ఏలూరుకు అక్కడ నుంచి విజయవాడ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. తలకు ఆపరేషన్ చేయడానికి ఖర్చు అధికంగా అవుతుందని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. సుమారు రూ.15 లక్షల వరకు అవసరం కావడంతో దాతల సహకారం కోసం కుటుంబ సభ్యులు ఎదురు చూస్తున్నారు.

రూ.50 వేలు అందించిన ఫొటోగ్రాఫర్లు

ఫొటోగ్రాఫర్ అనిల్‌కుమార్ వైద్యానికి పట్టణ ఫొటోగ్రాఫర్లు రూ.50 వేలు తక్షణ సహాయం అందించారని కుటుంబ సభ్యులు తెలిపారు. సహాయం అందించే దాతలు 9177175556 సంప్రదించాలని కోరుతున్నారు.

'లోకేష్ పాదయాత్రను జయప్రదం చేయాలి'


ద్వారకాతిరుమల చేరుకున్న టిడిపి ముసునూరు నాయకులు

ప్రజాశక్తి - ముసునూరు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర విజయవంతం కావాలని ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే రఘుబాబు ఆధ్వర్యంలో టిడిపి మండల నాయకులు శ్రీవెంకటచలస్వామి సన్నిధిలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండల నాయకులు దేవినేని ఢలరామ్, చిలుకూరి వెంకటేశ్వరరావు, లక్కపాము కాంతారావు, పొదిలి ధర్మారావు, నందిపాము యేసుబు, నీలపాల నాగరాజు, మందలపు వెంకటేశ్వరరావు, అక్కినేని చింటు, రేగుల ప్రకాష్, రాపర్ల ప్రతాప్, కాటేపల్లి ప్రసాద్, కాటేపల్లి సత్యనారాయణలు ద్వారకాతిరుమలకు పాదయాత్రగా చేరుకున్నారు.

టి.నరసాపురం :టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో చేపట్టిన పాదయాత్ర విజయవంతం కావాలని కోరుతూ టిడిపి మండల కార్యదర్శి నాయుడు రామకృష్ణారావు గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కాశీవిశ్వేశ్వర శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు నల్లూరి చలపతిరావు పాల్గొన్నారు.

చింతలపూడి :టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రను జయప్రదం చేయాలని ప్రగడవరం గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్ రెడ్డి, చిలుకూరి సుధీర్‌రెడ్డి, ఎంటిటిసి మాజీ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. లోకేష్ పాదయాత్రకు సంఘీభావంగా స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంకాలమ్మ ఆలయం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షులు బాషా, నల్లగోపు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కైకలూరు : లోకేష్ పాదయాత్ర విజయవంతం కావాలని టిడిపి నాయకులు కైకలూరులోని శ్రీ శ్యామలాంబ దేవస్థానంలో, ఆర్‌సిఎం చర్చిలో ప్రార్థనలు చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు జాని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు లింగం బాబు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి లక్ష్మీరాణి పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE, ELURU
E.P.10/2019, O.S.55/2013

Between:
వేల్పుల వెంకటేశ్వరరావు ...D.Hr
And
దేవు నాగరాజు, S/o.రామారావు, విద్యుత్ నగర్ కాలనీ, వట్లూరు, పెదపాడు మండలం. ...J.Dr

వేలము నోటీసు

పై నంబరు దావా గ్రంథములోని D.Hr తన బాకీని వసూలు చేసుకునే నిమిత్తం దాఖలు చేసిన ఈ E.P గ్రంథములో దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని **ది.20-02-2023 తేదీన ఉదయం 10.30 గం.లకు పై కోర్టు వారి ఎదుట బహిరంగముగా వేలం వేయ బడును.** వేలంలో పాడుకొనదలచిన వారు ఉదయం 10.30 గం.లకు ఆధార్ కార్డులతో వచ్చి వేలంలో పాల్గొనదలచినదిగా కోర్టు వారు ఆర్డరు వేసియున్నారు.

షెడ్యూలు : Landed property in an extent of Ac.0-10 cts covered by R.S.No.114/3 situated in kolaparru Grama panchayat, pedapadu mandalam, Eluru SRO, W.G.Dt., wrthmi the following boundaries
East: Land of Kadaganchi Lakshmi
South: Land of Balda Manikyamma
West: Land of Ramini China Venkateswara Rao,
North: Land of Vare Veera Swamy.
An extent of Ac.0-10 cts of land, with all the easementary rights.
D.Hr Value - more than five lakhs
Amin Value - Rs.2,00,000/- to Rs.3,00,000/-
Eluru **S.Brahmam,** Advocate,
Dt.27-01-2023 Eluru. Cell: 94929 32214

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, తణుకు వారి కోర్టులో
ఓ.యస్. నెం. 630/2021

బిట్వీన్:
నవ్య కృష్ణ ఇండస్ట్రీస్, పెనుగొండ రిప్రజెంటెడ్ బై ఇట్స్ ప్రొప్రయిటర్ పాచల పోతురాజు **-వాది**
మరియు
1. సూర్యరత్నం ఇండస్ట్రీస్, రిప్రజెంటెడ్ బై మేనేజింగ్ పార్టనర్, తటవర్తి ఎన్.వి.రామ్‌కుమార్, డోర్ నెం. 3-7-12/1, హోటల్ రత్న వద్ద.
2. తటవర్తి ఎన్.వి.రామ్‌కుమార్, తండ్రి: నాగేశ్వరరావు, మణీస్ ప్లాజా, 2వ ఫ్లోర్, మొహంతి వారి వీధి, భీమవరం-534202, భీమవరం మండలం, ప॥గో॥జిల్లా. భీమవరం అదనపు జిల్లా జడ్జి కోర్టు పరిధి. **-ప్రతివాదులు**

వాది తరపున దాఖలు చేసిన ప్రకటన

పై నెంబరు దావా, వాది ఖాతా పుస్తకాలలో ప్రతివాదుల తాలూకూ బాకీ మరియూ వడ్డీ అనగా రూ. 2,85,540/-లు వసూలు నిమిత్తం దాఖలు చేయగా మీరు కావాలని దావా సమన్లు తీసుకోనందున శ్రీ కోర్టు వారు మీకు పేపరు ప్రకటన ద్వారా దావా సమన్లు జారీ చేయవలసినదిగా ఆర్డరు వేసినారు. కావున మీరు **06-02-2023వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు కాని ఎడల మీ పరోక్షమునందు దావా విచారణ మరియు తీర్మానం జరుగునని ఇందుమూలంగా తమకు తెలియజేయడమైనది.

గోటేటి భాస్కరమూర్తి
తణుకు **గోటేటి సత్య వెంకట వరప్రసాద్**
ది.04-01-2023 అడ్వకేట్స్, తణుకు

మహారాజశ్రీ 4వ అదనపు జిల్లా జడ్జి, తణుకు వారి కోర్టులో
ఫైనల్ డిక్రీ ఐ.ఏ. నెం. 30/2022 ఇన్ ఓ.యస్. నెం. 33/2018

బిట్వీన్:
చింతా వెంకటలక్ష్మి **-పిటీషనర్/వాది**
మరియు
(1) కొవ్వూరి దయానిధి రెడ్డి
(2) నల్లిమిల్లి సుజాత
-రెస్పాండెంట్స్/ ప్రతివాదులు

పిటీషనర్/వాది తరపున దాఖలు చేసిన ప్రకటన

రెస్పాండెంట్/ప్రతివాది నెం.(1):
కొవ్వూరి దయానిధి రెడ్డి, తండ్రి: లేటు వెంకటరెడ్డి, డోర్ నెం. 1-21, మెయిన్‌రోడ్, వాటర్ టాంక్ వద్ద, నత్తారామేశ్వరం - 534124, పెనుమంట్ర మండలం, ప॥గో॥జిల్లా, తణుకు 4వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు.

పై నెంబరు పిటిషన్ ది. 01-10-2019 ప్రిలిమినరీ డిక్రీ ప్రకారం ఫైనల్ డిక్రీ పాస్ చేయమని కోరుచూ పిటిషనర్/వాది దాఖలు చేయగా, మీరు నోటీసులు అందుకొననందున శ్రీ కోర్టు వారు మీకు పేపరు ప్రకటన ద్వారా నోటీసులు జారీ చేయవలసినదిగా ఆర్డరు వేసినారు. కావున మీరు **10-02-2023వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అవ్వక తప్పిపోయిన ఎడల పై పిటిషన్ మీ పరోక్షమునందు విచారణ మరియు తీర్మానం జరుగునని ఇందుమూలంగా తమకు తెలియజేయడమైనది.

గోటేటి భాస్కరమూర్తి
తణుకు **గోటేటి సత్య వెంకట వరప్రసాద్**
ది.02-01-2023 అడ్వకేట్స్, తణుకు

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2nd అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. 54/2022 in O.S. 408/2021

బిట్వీన్:
సింగం పట్టాబి ***...Decree Holder/ DHR***
మరియు
అయినపర్తి విమల
...Judgement Debtor/JDR

పై నెంబరు డిక్రీ బాకీగాను జడ్జిమెంట్ డెటార్ అయినపర్తి విమల తాలూకు దిగువ షెడ్యూలు దాఖల స్థిరాస్తి **ది. 17-2-2023 వాయిదా రోజున ఉదయం 10.30 ని॥** లగాయతు పై కోర్టులో వేలం వేయబడును. కావున కావలసినవారు పాట షరతులు తెలుసుకొని పాడుకొనవచ్చును.

షెడ్యూలు

పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం సబ్ డి.లో చేరిన తాడేపల్లిగూడెం మండలంలోని అప్పారావుపేట రెవెన్యూలోని పంచాయితీ గల మోదుగగుంట గ్రామం తాలూకు రి.స. నెం. 430/25 రులో స.డోరు నెం. 1-2రుకు చేర్ని సుమారు చ॥గ॥ 168లో స్థలం, రేకుల షెడ్డు ఇల్లుకు హద్దులు.

తూర్పు: మెరిపో వీరయ్య గారి స్థలం - 34 అడుగులు. **దక్షిణం:** దిర్సిపో దానయ్య గారి స్థలం - 44.6 అడుగులు. **పడమర:** పంచాయితీ రోడ్డు - 34 అడుగులు. **ఉత్తరం:** దిర్సిపో దండియ్య గారి స్థలం - 44.6 అడుగులు.

యీ హద్దుల మధ్య చ॥గ॥ 168 స్థలం, రేకుల షెడ్డు ఇల్లున్నూ, అందలి రివాజు దారి మార్గములు, యావత్తు యీజుమెంటు హక్కులతో సహా సర్వమున్నూ.

డిక్రీ హోల్డర్ కిమ్మతు: రూ. 2,50,000/-
అమీన విలువ : రూ. 4,00,000/-

అద్దంకి విజయరత్నం, అడ్వకేట్
తాడేపల్లిగూడెం, సెల్: 9290188928